7

సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 29 । జనవరి । 2025



వైభవోపేతం.. అంజన్న రథోత్సవం

వేద పండితుల మంత్రాలు.. ప్రముఖుల ప్రత్యేక పూజలు.. భక్తుల నామస్మరణ మధ్య ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి రథోత్సవం ముందుకు కదిలింది. మంగళవారం తెల్లవారుజామున అత్యంత వైభవోపేతంగా సాగిన కార్యక్రమానికి వేలాది మంది భక్తజనులు హాజరై తరించారు. హనుమద్ నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

- ఊర్కొండ

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయిలో జోన్ గౌరవం పెంచాలి: డీఐజీ



మహబూబ్‌నగర్ క్రైం: కరీంనగర్‌లో మంగళవారం నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి 3వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు వెళ్తున్న ఉమ్మడి జిల్లా పోలీస్ క్రీడాకారులకు జోగుళాంబ జోన్–7 డీఐజీ కార్యాలయంలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ట్రాక్‌సూట్లు, షూ, ఇతర సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంలో, అలాగే శారీరక దృఢత్వాన్ని మెరుగుపరచడంలో ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. క్రీడలు మనోబలాన్ని పెంచడమే కాకుండా, దృఢమైన ఆత్మ విశ్వాసాన్ని కూడా కల్పిస్తాయని తెలిపారు. పోలీసు అధికారులు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపరచడం కోసం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైందన్నారు. ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్‌లో 20 క్రీడలలో ప్రతిభ కనబరిచిన 87 మంది క్రీడకారులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో జోగుళాంబ జోన్‌కు గౌరవం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి పాల్గొన్నారు.

నేడు 'కురుమూర్తి స్వామి' గిరి ప్రదక్షిణ

చిన్నచింతకుంట: ఉమ్మడి పాలమూరు ప్రజల ఆరాధ్యదైవం, అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తిస్వామి ఆలయం వద్ద బుధవారం అమవాస్య సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

31న ఇంటర్వ్యూలు

పాలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో ఉన్న ఈజేహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ఆరోగ్య శ్రీ విభాగంలో మూడు మెడికల్ ఆఫీసర్ల పోస్టులు భర్తీ చేయడానికి ఈ నెల 31న ఉదయం 11 గంటలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కొనసాగే ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఇతర వివరాల కోసం www.mahabubnagar.nic.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

జడ్చర్లలో జాబ్‌మేళా

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో శ్రీకార్తికేయ సెక్యూరిటీ సర్వీస్ సహకారంతో కళాశాల స్కిల్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సుకన్య తెలిపారు. కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించే మేళాలో ఫాక్స్‌కాన్ కంపెనీలో 500 ఉద్యోగాల కోసం ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతి చదివి 18 నుంచి 30 ఏళ్ల వయసు లోపువారు అర్హులని, మేళాకు పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లు, పాస్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

హైపర్ టెన్షన్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీగా పెరుగుతున్న అసంక్రమిత వ్యాధులు

- రోజురోజుకీ విజృంభిస్తున్న బీపీ, షుగర్ వ్యాధులు
- మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 80,443 మంది బీపీ పేషెంట్లు
- పల్లె, పట్టణం తేడా లేకుండా అంతటా ఇదే తీరు
- ఇటీవల నిర్వహించిన ఎన్సీడీ సర్వేలో వెల్లడి




సాక్షి, నాగర్‌కర్నూల్: నిన్న మొన్నటి వరకు 40 ఏళ్లు దాటితేనే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడేవారు. ఇప్పుడు సీన్ మారింది..30 ఏళ్లకే రక్తపోటు, డయాబెటీస్ ముప్పు వెంటాడుతోంది. పల్లెటూరు, పట్నం తేడా లేకుండా జీవనశైలి వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు రోజురోజుకీ పెరుగుతున్నారు. మారుతున్న జీవన శైలి, శారీరక శ్రమలేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పుల ఫలితంగా యుక్తప్రాయంలోనే రక్తపోటుకు గురవుతున్నారు. ఇటీవల వైద్య, ఆరోగ్యశాఖ నిర్వహించిన ఎన్సీడీ (నాన్ కమ్యూనికేబుల్) సర్వేలో ఆశ్చర్యకరమైన విషయాలు వెల్లడయ్యాయి.

క్షేత్రస్థాయి సర్వేలో తేలిన లెక్కలు..

మారుతున్న జీవనశైలి నేపథ్యంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండటంతో ప్రభుత్వం వైద్య సిబ్బందితో క్షేత్రస్థాయిలో ఎన్సీడీ సర్వే చేపడుతోంది. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో భాగంగా అన్ని పీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లో ఎన్సీడీ ద్వారా పరీక్షలు చేస్తూ దీర్ఘకాలిక వ్యాధు లను గుర్తిస్తున్నారు. బీపీ, షుగర్‌తో పాటు నోటి క్యాన్సర్, గైనిక్ సంబంధించి క్యాన్సర్లకు సంబంధించి అనుమానిత లక్షణాలున్న వారిని గుర్తించి నిర్ధారణకు హైదారాబాద్‌కు రిఫర్ చేస్తున్నారు. బీపీ, షుగర్‌తో బాధపడే వారికి మందులు అందజేస్తూ వ్యాధి తీవ్రం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

30 ఏళ్లకే బీపీ, షుగర్..

మారుతున్న జీవన శైలి, వృత్తి, ఉద్యోగ జీవితాల్లో ఒత్తిళ్లు, శారీరక శ్రమలేకపోవడం, ఉద్యోగ విధుల్లో భాగంగా ఎక్కువ సమయం కుర్చీలకే పరిమితం కావడం, వ్యాయామానికి సమయం కేటాయించకపోవడం తదితర కారణాలతో 30 నుంచి 40 ఏళ్లలోనే ఎక్కువ శాతం మంది బీపీ, షుగర్ వ్యాధుల బారిన పడుతున్నారు. గతంలో వీధికి ఒక్కరో, ఊరికి ఇద్దరో అన్నట్టుగా ఉండే బాధితులు ఇప్పుడు ఇంటికొకరు అన్నట్టుగా పెరిగిపోతున్నారు. ఈ జాబితాలో యువత సైతం ఎక్కువగా ఉంటుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో 50–60 ఏళ్లు దాటిన వారు అధికంగా ఉంటే వయసుతో సంబంధం లేకుండా 40 ఏళ్ల లోపు వారు ఎక్కువవుతున్నారు. బీపీ, షుగర్ వ్యాధులు ఒక్కసారి వస్తే జీవితాంతం వాటికి మందులు వాడుతూనే జాగ్రత్తలు పాటించాల్సిన పరిస్థితి నెలకొంది.



ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించాలి..



ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల దృష్టిసారించి, జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. 30 ఏళ్ల నుంచే ఆహారం పట్ల జాగ్రత్తలు పాటించాలి. నిత్య జీవితంలో ఉప్పు వాడకాన్ని తగ్గించుకోవాలి. కార్బోహైడ్రేట్స్ ఎక్కువ ఉండే ఆహారాన్ని తగ్గించాలి. సమతుల్య ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి. 40 ఏళ్లకు దగ్గర పడుతున్న వారు తరచుగా బీపీ, షుగర్ లెవల్స్ చెక్ చేయించుకోవాలి.

– డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, నాగర్‌కర్నూల్

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువమంది..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. 30 ఏళ్లు పైబడిన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 50శాతంపైగా దీర్ఘకాలిక వ్యాధులకు గురైనవారు ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా 80,443 మంది బీపీ, 46,531 మంది షుగర్ బాధితులు ఉన్నారు. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో 73,762 మంది బీపీ, మరో 36,383 మంది షుగర్ వ్యాధిగ్రస్తులుగా నిర్ధారణ అయ్యారు. మిగతా జిల్లాలతో పోలిస్తే వనపర్తి జిల్లాలో బీపీ, షుగర్ బాధితులు ఉన్నట్టుగా తేలింది. అలాగే బీపీ, షుగర్ రెండూ ఉన్నవారు సైతం మరో పదిశాతం వరకు ఉంటున్నారు. వీటికి తోడు కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నవారు సైతం ఒక్కో జిల్లాలో 300 నుంచి 500 మంది వరకు ఉన్నారు.



ఏసీడీ సర్వేలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

జీవనశైలి మార్చుకోకుంటే ముప్పు..

జీవనశైలి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండకపోతే ముప్పు తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సమతుల్య ఆహారం, వ్యాయామంతో పాటు ప్రతిరోజూ విటమిన్ డీ కోసం ఉదయం వేళలో కాసేపు ఎండ తగిలేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. ఆహారంలో ఉప్పు, కార్బోహైడ్రేట్స్ శాతం చాలా తక్కువగా ఉండేలా జాగ్రత్త వహించాలని చెబుతున్నారు.

'మద్దతు' కోసం రోడ్డెక్కారు



మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట బైఠాయించిన రైతులు



రైల్వేట్రాక్ వద్ద రైతులను కట్టడి చేస్తున్న పోలీసు బలగాలు

వేరుశనగ రైతుల ఆందోళన

- ధర భారీగా తగ్గించడంతో ఆగ్రహం
- బస్టాండ్ వైపు వెళ్లేందుకు రైతుల ప్రయత్నం
- అడ్డుకొని..తిరిగి మార్కెట్‌కు పంపించిన పోలీసులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): మద్దతు ధర కోసం వేరుశనగ రైతులు రోడ్డెక్కారు. టెండర్‌దారులు, అధికారులు కావాలనే ధరను తగ్గించారని ఆరోపిస్తూ మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళనకు దిగారు. పాలకవర్గం చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల వ్యాపారులంతా కుమ్మక్కు కావడంతోనే కనీస మద్దతు ధరలు రావడం లేదని, తమను నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు వాపోయారు. కనీసం మార్కెట్‌కు తెచ్చిన వేరుశనగ పంట నాణ్యతను గుర్తించకుండా తక్కువ ధరలు నిర్ణయిస్తున్నారని మండిపడ్డారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం ఉదయం నుంచి పాలమూరు మార్కెట్ యార్డుకు వేల క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. అయితే క్వింటాల్ రూ.6,500 నుంచి రూ.7,000 పలకాల్సిన పల్లీల ధర ఒక్కసారిగా రూ.3,500 నుంచి రూ.4,000లకు తగ్గించారు. దీంతో టెండర్‌దారులు, మార్కెట్ అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మద్దతు ధర ఇవ్వకుండా సగానికి సగం ధర తగ్గించడంపై నిలదీశారు. సాయంత్రం వరకు ధరను పెంచకపోవడంతో రైతులందరూ మార్కెట్ యార్డు కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి, ధర్నా చేపట్టారు. మార్కెట్‌కు నిత్యం 30 వేల నుంచి 50 వేల క్వింటాళ్ల వరకు పల్లీలు వస్తున్నా.. అధికారులు 20 వేల నుంచి 25వేల క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయని చూపిస్తున్నారని వారు ఆరోపించారు. గట్టు చప్పుడు కాకుండా దిగుమతి దారులతో కమీషన్ మాట్లాడుకొని భారీగా దండుకుంటున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాగా.. రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు శతవిధాలా ప్రయత్నించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోని సిబ్బందితో పాటు చుట్టుపక్కల మండలాల స్టేషన్ల నుంచి బలగాలను పిలిపించి రైతులను కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. రైతులు బస్టాండ్ వైపు దూసుకుపోవడంతో.. అడ్డుకున్న పోలీసులు వారిని రైల్వే గేటు వద్దే కట్టడి చేసి తిరిగి మార్కెట్ యార్డుకు తరలించారు. ఈ నేపథ్యంలో రైల్వే ట్రాక్ వద్ద రైతులు, పోలీసులకు మధ్య కొంత తోపులాట జరిగింది. మార్కెట్ యార్డులో నెలకొన్న సమస్య మార్కెట్ కమిటీ అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని, రోడ్డెక్కితే ఎలాంటి ప్రయోజనం ఉండదని పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రైతులు ఆందోళన చేస్తున్నంత సేపు పరిస్థితులు ఉద్రిక్తంగా కనిపించాయి. రెండు, మూడు రోజులుగా అచ్చంపేట, వనపర్తి, కల్వకుర్తిలలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు సంయమనంతో రైతుల ఆందోళనను విరమింపజేసి వారికి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనితతో మాట్లాడించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేరుశనగ పంటను విక్రయానికి తెస్తున్న రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

7 నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాలు



మన్యంకొండ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ జానకి, జిల్లా అధికారులు

- వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి
- జాతర సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఫిబ్రవరి 7 నుంచి మార్చి 16 వరకు నిర్వహించనున్న మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఎస్పీ జానకితో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలోనే చిన్న తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండకు వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, గతేడాది జరిగిన లోటుపాట్లు పునరావృతం కాకుండా ఈసారి అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. భక్తులకు అవసరమైన తాగునీరు, శానిటేషన్, టాయిలెట్లు, బందోబస్తు రద్దీ నియంత్రణ, పార్కింగ్ వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. జాతరకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర వీఐపీలు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకనుగుణంగా అధికారులు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. కొండ మీదకు మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, ఫిట్‌నెస్ ఉన్న బస్సులనే నడపాలన్నారు. కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటన చేసి ఏర్పాట్లు పరిశీలించాలని కోరారు. ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ పోలీస్‌శాఖ తరఫున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్యూ లైన్ నిర్వహణ, షీ టీమ్‌లు, మఫ్టీ బృందాలు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

➩ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టం ఫిబ్రవరి 12న స్వామివారి గరుడ వాహనసేవ, రథోత్సవం, ఫిబ్రవరి 26న మహాశివరాత్రి, అలాగే మార్చి 14న అమ్మవారి తిరు కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనసేవ, విమాన రథోత్సవం ఉంటాయని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతేడాది కంటే ఎక్కువ ఆర్టీసీ బస్సులు నడపాలని, వైద్య ఆరోగ్యశాఖ తరఫున కొండపైన, కొండ దిగువన అలివేలు దేవాలయం వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపు ఏర్పాట్లు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, 5 కిలోమీటర్ల పరిధిలో మద్యపానాన్ని నిషేధించాలని ఆయాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, మన్నెంకొండ దేవస్థానం చైర్మన్ అలహరి మధుసూదన్, డీఆర్‌ఓ రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మన్‌యాదవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ షురూ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు పాలమూరు కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. వాస్తవానికి ఈనెల 4వ తేదీన గెజిట్ విడుదలైనప్పటికీ మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం గడువు ఈనెల 26వ తేదీ వరకు ఉండటంతో ఇన్ని రోజులు అధికారులు ఆగారు. ఈ క్రమంలోనే ఈనెల 27 నుంచి ప్రత్యేక అధికారి పాలనలోకి వచ్చింది. ప్రస్తుతం పట్టణ జనాభా మూడు లక్షలు దాటడంతో 49 వార్డుల నుంచి 60 వరకు పెంచుకోవడానికి ఉన్నతాధికారులు అవకాశం కల్పించారు. వారి ఆదేశాల మేరకు తాజాగా మంగళవారం దివిటిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, సీనియర్ అకౌంటెంట్ ఇందిర పరిశీలించారు. అక్కడి వివిధ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈనెల 29న జైనల్లీపూర్ గ్రామపంచాయతీకి వెళ్లి పరిశీలించనున్నారు. మరోవైపు మున్సిపల్ కార్యాలయ బోర్డును సైతం కార్పొరేషన్ పేరిట త్వరలోనే ఏర్పాటు చేయనున్నారు.

నిర్దేశిత గడువులోగా పరిశ్రమలకు అనుమతులు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో టీజీ ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు ముందుకువచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిర్దేశిత గడువులోగా అనుమతులను మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శివేంద్ర ప్రతాప్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీప్రైడ్ ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఆరుగురికి ట్రాక్టర్ అండ్ ట్రైలర్స్, షెడ్యూల్డ్ తెగలకు చెందిన 17 మందికి ట్రాక్టర్ అండ్ ట్రైలర్స్, మారుతి డిజైర్, ఇతర వాహనాలు, పెట్టుబడి సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. అదే విధంగా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు నివేదించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం డిజిటల్ ప్లాట్ ఫాంను ప్రారంభించిందని.. ఉద్యోగాలు కోరే యువత, ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు www.tsdeet.com వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాస్థాయి ఎక్స్‌పోర్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులతో ఎగుమతికి అవకాశం ఉన్న వస్తువులపై చర్చించారు. బంగినపల్లి మామిడిపండ్ల ఎగుమతికి కార్యాచరణ రూపొందించి, డైరెక్టర్ జనరల్ ఫారన్ ట్రేడ్ హైదరాబాద్ కమిషనర్‌కు, పరిశ్రమల శాఖకు పంపించాలని నిర్ణయం తీసుకున్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, ఎల్‌డీఎం భాస్కర్, భూగర్భ జల వనరుల శాఖ డీడీ రమాదేవి ఉన్నారు.

ఉద్యమ బిడ్డకు అరుదైన అవకాశం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్‌వెస్లీ


- విద్యార్థి దశ నుంచే ఉద్యమ బాట
- కుల వివక్ష, పెట్టుబడి దారి, భూస్వామ్య వ్యవస్థలపై అలుపెరగని పోరాటం

అమరచింత: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరచింత పట్టణానికి చెందిన జాన్‌వెస్లీకి అరుదైన అవకాశం లభించింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారనే వార్త పట్టణ ప్రజల్లో సంతోషాన్ని నింపింది. పిలిస్తే పలికే వ్యక్తిగా.. ఆపదలో అండగా ఉంటూ పోరాడే తత్వంతో.. అందరికీ సుపరిచితుడిగా మారిన జాన్‌వెస్లీ జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఇక్కడి ప్రజలు ఆశిస్తున్నారు. విద్యార్థిదశ నుంచి ఉద్యమం వైపు అడుగులు వేశారు. ఉద్యమాలకు పురిటి గడ్డగా ఉన్న అమరచింతకు 1978లో గద్దర్ లాంటి వ్యక్తులు ఇక్కడి రావడం, స్థానిక నాయకులు రామచంద్రారెడ్డి, మహమూద్ ఉద్యమస్ఫూర్తితో వామపక్ష విద్యార్థి సంఘం నాయకుడిగా గెలుపొందారు. అక్కడి నుంచి జాన్‌వెస్లీ ఉద్యమ ప్రస్థానం అలుపెరగకుండా ముందుకు సాగింది.

ఉద్యమ ప్రస్థానం..

జాన్‌వెస్లీ కుటుంబసభ్యులు సైతం కమ్యూనిస్టు వామపక్ష వాదులుగా కొనసాగుతుండటంతో జాన్‌వెస్లీ ఉద్యమ ప్రస్థానం ఇంటి నుంచే మొదలైంది. విద్యార్థి దశలో విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యారంగ సమస్యలపై పోరాడుతూ వచ్చారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉంటూ ఈ ప్రాంతంలో చేపట్టిన ఆందోళనలలో చురుకుగా పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. కులవివక్ష నేపథ్యంలో కేవీపీఎస్ ఆవిర్భావం నుంచే కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కొనసాగుతూ.. పాదయాత్రల ద్వారా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు సైతం జాన్‌వెస్లీ పోరాటాల ఫలితంగానే అమలులోకి వచ్చాయి.

ఇదీ కుటుంబ నేపథ్యం..



స్వగ్రామం : అమరచింత
తల్లిదండ్రులు : మోజస్, బేతమ్మ
సోదరులు : సామేల్, గిడియన్, సాము, జోసెఫ్
భార్య : భారతి,
కొడుకు : అంకుష్

ప్రస్తుతం రాష్ట్రంలో ఇళ్లులేని పేదలకు ఇళ్లు ఇవ్వాలంటూ గత మూడేళ్ల కిందట గుడిసెల పోరాటం చేపట్టారు. వీటికి సైతం జాన్‌వెస్లీ ముందుండి రామోజీ ఫిలిం సిటీ ఆక్రమించుకున్న పేదల భూముల్లో గుడిసెలు వేసి పోరాటం చేపట్టారు. బషీర్‌బాగ్ కాల్పుల ఘటన, విద్యుత్ ఆందోళన ఇలా ఎన్నో సందర్భాల్లో పోలీసుల నిర్బంధాలు, అరెస్టులను సైతం లెక్క చేయకుండా తన పంథా పేదల పక్షం అంటూ ముందుకు సాగారు.

నిరంతరం పేదల పక్షమే..

రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంలో ఇకపై నిరంతరం పేదల పక్షాన పోరాటాలు చేస్తూ సంక్షేమ పథకాలు పేదలందరికీ చేరాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్లు జాన్‌వెస్లీ చెప్పారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ కొత్తగా ఆరు గ్యారంటీల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతు భరోసా, ఉపాధి కార్మికులను ఆదుకోవడం, పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ తదితర పథకాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వీటిని అమలుపరిచే వరకు కార్మిక, గ్రామిక, కర్షక వర్గాలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. ఇచ్చిన హామీలను అమలు పరిచే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు.

క్లుప్తంగా

తగ్గిన ఉల్లి ధర

దేవరకద్ర: స్థానిక మార్కెట్‌లో మంగళవారం ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహించారు. బుధవారం అమావాస్య కారణంగా సెలవు కావడంతో ఒక రోజు ముందుగానే వేలం జరిగింది. గతవారంతో పోలిస్తే ఈ వారం ఉల్లి ధర దిగివచ్చింది. నాణ్యంగా ఉన్న ఉల్లి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.3,610గా పలికింది. గత వారం కంటే రూ.610 వరకు తగ్గింది. కనిష్ఠంగా రూ.2,000 ధర వచ్చింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా గరిష్ఠంగా రూ.1,800, కనిష్ఠంగా రూ.1,000 వరకు ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగించారు. ఇక కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,166, కనిష్ఠంగా రూ.6,809గా లభించాయి. సీజన్ తగ్గిన కారణంగా మార్కెట్‌కు 200 బస్తాలు కందులు అమ్మకానికి వచ్చాయి.

బాల కార్మికులను రక్షించాలి



పాలమూరు: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర మంగళవారం పట్టణంలోని ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్ హోమ్‌ను సందర్శించారు. స్థానిక పరిస్థితులను పరిశీలించి, స్థానిక వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా హోంలో నూతన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఆపదలో ఉన్న పిల్లలను రక్షించడం, పునరావాసం కల్పించడం కోసం ఆపరేషన్ స్మైల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ఎక్కడైనా పిల్లలు బాల కార్మికులుగా ఉంటే రక్షించి హోంకు తరలించాలన్నారు.

- జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో విద్యాహక్కు చట్టం, బాలల హక్కుల చట్టాలు, బాల్య వివాహాలు, పోక్సో యాక్ట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

చిన్నారుల్లో టీబీ లక్షణాలు గుర్తించాలి

పాలమూరు: చిన్నారుల్లో ఉండే టీబీ లక్షణాలను సకాలంలో గుర్తించి పరీక్షలు చేయడానికి ప్రైవేట్ చిన్న పిల్లల వైద్యులు సహకరించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం టీబీ అలెర్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో చిన్న పిల్లల్లో ఉండే టీబీ లక్షణాలు పరీక్షలు విధానంపై ప్రైవేట్ చిన్న పిల్లల వైద్యులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ చిన్నారుల్లో తరచూ దగ్గు, తెమడతో కూడిన రక్తం పడటం, జ్వరం, వయసుకు తగినంత బరువు పెరగకపోవడం, మెడ, సంకల్లో గడ్డలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించాలన్నారు. చిన్నారుల్లో టీబీ లక్షణాలు ఉంటే వారి శాంపిల్స్ సేకరించి టీబీ కార్యాలయానికి పంపిస్తే అక్కడ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న ప్రైవేట్ చిన్న పిల్లల వైద్యులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ మల్లిఖార్జున్, డాక్టర్ శ్రీలత, వెంకట్, టీబీ అలెర్ట్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని..

- యువకుడిపై దాడి
- చికిత్స పొందుతూ మృతి



నర్సింహులు (ఫైల్)

నవాబుపేట: తమ సోదరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఓ యువకుడిపై నలుగురు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన నవాబుపేట మండలం మరికల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మరికల్‌కు చెందిన బైండ్ల నర్సింహులు (32) అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న నెపంతో పలుమార్లు గొడవ చోటు చేసుకుంది. ఏడాది క్రితం నర్సింహులుపై వివాహిత సోదరులు దాడికి పాల్పడ్డారు. ఆరునెలల క్రితం అతడి ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టారు. మంగళవారం వ్యవసాయ పొలంలో ఒంటరిగా ఉన్న నర్సింహులుపై నలుగురు మూకుమ్మడిగా దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. అనంతరం అతడిని ద్విచక్ర వాహనంపై గ్రామానికి తీసుకువచ్చి మరోసారి దాడిచేశారు. ఈ క్రమంలో నర్సింహులు భార్యతో పాటు చుట్టుపక్కల వారు వారించి, అతడిని 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు నర్సింహులు మృతికి కారణమైన జోగు యాదయ్య, అతడి సోదరులు శ్రీను, నర్సింహులు, బాల్‌రాజ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. కాగా, ఈ ఘటనకు ప్రధాన కారకురాలైన వివాహితపై సైతం పలువురు దాడికి పాల్పడటంతో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వైభవోపేతం.. అంజన్న రథోత్సవం



స్వామివారి రథోత్సవానికి హాజరైన భక్తజనం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

- భక్తజనసంద్రంగా ఊర్కొండపేట
- దర్శించుకున్న జడ్చర్ల, కల్వకుర్తి ఎమ్మెల్యేలు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున కనుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగి తరించారు. ముందుగా అర్చకులు ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించిన రథంపై ఉంచారు. అనంతరం రథానికి పూజలు చేశాక ముందుకు లాగారు. భక్తుల హనుమాన్ నామస్మరణతో ఆలయ ఆవరణ మార్మోగగా.. వేలాదిగా తరలివచ్చిన భక్తజనులతో ఊర్కొండపేట భక్తజన సంద్రంగా మారింది. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి మన్యసూక్తులతో అష్టోత్తర నామావళి, మంగళహారతి, మంత్రపుష్పం, రాత్రి పల్లకీసేవ, హరికథా కాలక్షేపం నిర్వహించారు. అంతకు ముందు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆలయంలో పూజలు చేసి స్వామివారి పల్లకీ ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. రథోత్సవంలోనూ పాల్గొని రథాన్ని లాగారు. అలాగే రథోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతోపాటు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కమిటీ సభ్యులు, నాయకులు వెంకటయ్యగౌడ్, నిఖిల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రమేష్‌నాయక్, పర్వత్‌రెడ్డి, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

- ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్వామివారి రథానికి పూజలు చేస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, పక్కన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

మానవజాతి మనుగడకే ముప్పు



సదస్సులో మాట్లాడుతున్న పీయూ వైస్‌చాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్

- పీయూ వైస్‌చాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్
- కొల్లాపూర్ పీజీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై అంతర్జాతీయ సదస్సు

కొల్లాపూర్: పర్యావరణ సమతుల్యం దెబ్బతింటే మానవజాతి మనుగడకే ముప్పు ఏర్పడుతుందని పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై కొల్లాపూర్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రత్నగిరి ఫౌండేషన్ సహకారంతో సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు జీఎస్ శ్రీనివాస్‌తో పాటు పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి, దర్బన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్.రవీందర్ రెనా, జెఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్.విజయలక్ష్మీ, ఉగండాకు చెందిన ఫ్రాంక్ గ్రామ్‌సేన్ కిజ్జా, గ్రీన్ ఎనర్జీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్.కటికనేని సాయిప్రసాద్, రత్నగిరి ఫౌండేషన్ నిర్వాహకులు జూపల్లి జగన్మోహన్‌రావులు హాజరయ్యారు. సదస్సును వీసీ జీఎన్.శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది అందరి బాధ్యత అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోకుంటే భవిష్యత్‌లో ఆక్సిజన్ కోసం సిలిండర్లు వెంటబెట్టుకొని తిరగాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. సహజ వనరులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలన్నారు. చెట్ల పెంపకం ద్వారా గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించవచ్చన్నారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తే ఎటువంటి ఆపదలు ఎదురవుతాయో ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న సునామీలు, భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, సముద్రమట్టాల్లో భారీ మార్పులే నిదర్శనమన్నారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలుచేయాలని అభిప్రాయపడ్డారు. సదస్సు రెండు సెషన్లు సాగింది. పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మార్క్‌పోలోనియస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు కన్వీనర్‌గా మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ అధ్యాపకులు దేవరాజ్ వ్యవహరించారు. పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



సాఫ్ట్‌బాల్ జట్టుతో శారదాబాయి తదితరులు

- ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి
- తూప్రాన్ తరలిన సాఫ్ట్‌బాల్ ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి ఆకాంక్షించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో బుధవారం నుంచి ఈనెల 31 వరకు జరిగే అండర్-14 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు మంగళవారం తరలివెళ్లాయి. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ స్టేడియంలో జిల్లా జట్ల సభ్యులను శారదాబాయి అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, నాగరాజు, రాఘవేందర్, సుగుణ, వెంకటయ్య, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా బాలుర జట్టు

వి.నరేష్‌నాయక్, పి.అనిల్‌నాయక్, వి.శివకుమార్, సాయికుమార్, రంజిత్, సందీప్, గణేష్, కమలాకర్, మోక్షిత్, శశిధర్, వరుణ్, సిద్దార్థ, కార్తీక్, వికాస్, ఎండీ జుబేర్, సాయితేజ

బాలికల జట్టు

బి.గాయత్రి, వి.నందిని, మనీషా, నవ్యశ్రీ, శ్రావణి, ఎం.నందిని, కె.శిరీష, హారిక, రాధిక, ఎ.గాయత్రి, జి.శిరీష, ఎం.రక్షిత, పి.అలకనంద, కళ, ప్రవళిక, అంజలి.

ఉత్సాహంగా రగ్బీ జిల్లా జట్లు ఎంపిక



రగ్బీ క్రీడాకారులతో డీవైఎస్‌ఓ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మంగళవారం సబ్ జూనియర్ జిల్లా బాలబాలికల రగ్బీ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రగ్బీ క్రీడల్లో జిల్లా జట్లు రాణించి చాంపియన్‌లుగా నిలవాలని కోరారు. జిల్లా రగ్బీ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మంచిర్యాలలో వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ రగ్బీ పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రగ్బీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, ఎస్‌జీఎఫ్ మాజీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సోహైల్ ఉర్ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు: పవన్‌కుమార్, ప్రశాంత్‌చారి, రాంచరణ్, వసంత్, మహేష్, శ్రీధర్, ఎండి.రేహాన్, అభిలాష్, అభిరాం, గోపాలకృష్ణ, శ్రీనివాస్‌నాయక్, వివేక్ వర్ధన్.

బాలికలు జట్టు: చరిత, ప్రవళిక, నాగేషా, ప్రీతి, పి.అంజలి, హరీషా, అంజలి, రాధిక, అఖిల, అక్షర ప్రణవి, మీనాక్షి, మౌనిక, అక్షిత, శిరీష, అంకిత.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు రవి

- రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్న జిల్లా యువకుడు
- రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణింపు
- ఇండియన్ రౌండ్‌లో ప్రాక్టీస్



జాతీయస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో రజత పతకంతో రమావత్‌రవి

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉత్తరాఖండ్‌లో ఈనెల 31 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జరిగే 38వ జాతీయ క్రీడలకు జిల్లా కేంద్రానికి చెందిన ఆర్చరీ క్రీడాకారుడు రమావత్ రవి ఎంపికయ్యాడు. ఆర్చరీ పోటీలకు తెలంగాణ నుంచి పురుషుల విభాగంలో ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కాగా.. అందులో రవి ఒకరు. ఇండియన్ రౌండ్ విభాగంలో రమావత్ రవి జాతీయ క్రీడల్లో పోటీపడుతుండడంపై జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీకాంత్ రాథోడ్, రాంచందర్, కోచ్ జ్ఞానేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో పతకం సాధించాలని ఆకాంక్షించారు.

ఆరేళ్ల నుంచి శిక్షణ..

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద రమావత్ రవి ఆర్చరీలో ఆరేళ్ల నుంచి శిక్షణ తీసుకుంటున్నాడు. ఇప్పటి వరకు 12 సార్లు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించాడు. రాష్ట్ర స్థాయిలో 2024 వరంగల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో, సబ్ జూనియర్ పోటీల్లో, హైదరాబాద్‌లో జరిగిన సీనియర్ పోటీల్లో బంగారు పతకాలు సాధించడంతో పాటు ఈ ఏడాది జనవరిలో 12న హైదరాబాద్‌లో జరిగిన జూనియర్ ఆర్చరీ పోటీల్లో రజత పతకం సాధించాడు.

నాలుగు సార్లు జాతీయస్థాయి పోటీలకు..

రమావత్ రవి ఇప్పటి వరకు నాలుగు సార్లు జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. 2023 మధ్యప్రదేశ్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయస్థాయి పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో పాల్గొన్నాడు. 2024లో గుజరాత్ రాష్ట్రంలోని నడియాడ్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో రజత పతకం సాధించాడు. గతేడాది జంషెడ్‌పూర్‌లో జరిగిన సీనియర్ నేషనల్, రాజస్థాన్‌లో జరిగిన సబ్‌జూనియర్ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొన్నాడు.

ఒలింపిక్‌లో దేశానికి ప్రాతినిధ్యం

చిన్నప్పటి నుంచి క్రీడల అంటే ఎంతో ఇష్టం. ఆరేళ్ల నుంచి ఆర్చరీలో కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద శిక్షణ తీసుకుంటున్న. జాతీయ క్రీడలకు ఎంపికై నందుకు చాలా సంతోషంగా ఉంది. జాతీయ క్రీడల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి పతకం సాధించి రాష్ట్రానికి, జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకొస్తా. భవిష్యత్‌లో దేశానికి ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. అందుకోసం నిరంతరం సాధన చేస్తున్నా.

– రమావత్ రవి, ఆర్చరీ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్


విద్యార్థిని మృతికి కారణమైన యువకుడికి ఏడేళ్ల జైలుశిక్ష

మరికల్: ప్రేమ పేరుతో విద్యార్థినిని వేధింపులకు గురిచేసి, ఆమె మృతికి కారణమైన యువకుడికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 20,200 జరిమానా విధిస్తూ నారాయణపేట సీనియర్ సివిల్‌జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వింధ్య నాయక్ తీర్పు ఇచ్చారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ వివరాల మేరకు.. మరికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని 2017లో మహబూబ్‌నగర్‌లోని జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న సమయంలో మరికల్ మండలం కన్మనూర్‌కు చెందిన తెలుగు వంశీ అలియాస్ చింటు ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేశాడు. అంతేకాకుండా బయట ఎవరితోనైనా మాట్లాడితే చంపేస్తానని బెదిరించడంతో పాటు విద్యార్థినితో తీసుకున్న ఫొటోలను మీ ఊరిలో అందరికీ చూపిస్తానని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కోచింగ్ సెంటర్, కళాశాల వద్ద పలుమార్లు విద్యార్థినిపై దాడి చేశాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని 2017 సెప్టెంబర్ 13న తన ఇంట్లో పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. తన కూతురు మృతికి కారణమైన యువకుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అప్పటి ఎస్ఐ జములప్పకు తండ్రి ఫిర్యాదు చేశాడు. అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి కేసును విచారణ చేయగా.. బదిలీపై వచ్చిన మరో సీఐ రాంలాల్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ రాము ఆదేశాల మేరకు ఏఎస్ఐ, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కృష్ణయ్యగౌడ్, సీడీఓ వీరప్ప, హన్మంతు, శ్రీధర్‌లు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేను కోర్టులో వాదనలు వినిపించారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి వింధ్య నాయక్ నిందితుడికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ. 20,200 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. నేరస్తుడికి శిక్ష పడటానికి కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ పోలీసులను ఎస్పీ అభినందించారు.

బాలికపై లైంగిక వేధింపులు : కేసు నమోదు

తిమ్మాజిపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను లైంగికంగా వేధించిన సంఘటనలో ఫొటోగ్రాఫర్ మహేష్‌పై పోక్సో, అత్యాచారం కేసు నమోదైంది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న మహేష్.. అదే గ్రామానికి చెందిన బాలిక(16) ఫొటోలు తీసి వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయమై బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో మంగళవారం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మహేష్‌పై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

11.40 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లం

నారాయణపేట: వాహనాల తనిఖీల్లో 11.40 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు సీఐ శివశంకర్ మంగళవారం తెలిపారు. సీఐ వివరాల మేరకు.. సోమవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గుర్మిట్కల్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న బొలేరో వాహనంలో నల్లబెల్లం ఉన్నట్టు గుర్తించి విచారించారు. కిరణ్, రాజు అనే వ్యక్తులు గుర్మిట్కల్‌లో హనుమాన్ నాయక్ వద్ద బెల్లం కొనుగోలుచేసి.. మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మొత్తం 38 బస్తాల్లో 11.40 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామని.. దీన్ని విలువ రూ. 1.14 లక్షలు ఉంటుందని సీఐ వెల్లడించారు. బొలేరో వాహన డ్రైవర్ కిరణ్‌ను పట్టుకోగా.. రాజు పారిపోయాడని తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, బెల్లం అమ్మిన హనుమాన్ నాయక్, కిరణ్, రాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టీడీసీఏ టోర్నీ సెమీస్‌కు పాలమూరు



ఉమ్మడి జిల్లా జట్టుతో టీడీసీఏ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి

- క్వార్టర్ ఫైనల్‌లో మెదక్ జట్టుపై విజయం
- బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన రవితేజ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని దోమలగూడలో జరుగుతున్న తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అంతర్ జిల్లా టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచింది. మంగళవారం మెదక్ జట్టుతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 33 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. జట్టులో రవితేజ 61 బంతుల్లో 14 ఫోర్లు కొట్టి 82 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన మెదక్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. జట్టులో రిశ్వంత్ 40 పరుగులు చేశాడు. జిల్లా బౌలర్లు రవితేజ 2, రాంచరణ్ 2 వికెట్లు తీశారు.



రవితేజ (82పరుగులు నాటౌట్)

ఉమ్మడి జిల్లా ప్రతినిధుల అభినందనలు

టీడీసీఏ అంతర్‌జిల్లా టోర్నీలో సెమీఫైనల్‌కు చేరడంపై ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్, జట్టు కోచ్ నవాజ్‌షా, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి జిల్లా జట్టును అభినందించారు. ఇదే స్ఫూర్తితో సెమీఫైనల్, ఫైనల్‌లో మెరుగ్గా ఆడి అంతర్ జిల్లా టోర్నమెంట్‌లో చాంపియన్‌షిప్‌గా నిలవాలని ఆకాంక్షించారు. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి ప్రారంభించి ఆయా క్రీడాజట్లను అభినందించారు. కార్యక్రమంలో టీడీసీఏ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండరాళ్ల మధ్య చిరుత మృతదేహం

దామరగిద్ద: నారాయణపేట జిల్లా దామరగిద్దలో ఓ చిరుత బండరాళ్ల మధ్యలో చిక్కుకొని మృత్యువాత పడింది. మంగళవారం పొలాలకు వెళ్లి రైతులకు బండరాళ్ల మధ్య దుర్వాసన రావడంతో అటువైపు వెళ్లి పరిశీలించగా చిరుత మృతదేహం గుర్తించారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. డీఎఫ్ఓ ప్రసాద్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్ కమాలోద్దీన్, బీట్ అధికారి లక్ష్మణ్‌లు సంఘటన స్థలానికి చేరుకొని బండరాళ్ల మధ్య ఉన్న చిరుత కళేబరాన్ని బయటికి తీసి, జిల్లాకేంద్రంలోని పశువైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుడు అనురుధ్ ఆచార్య పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత రక్త నమూనాలు తదితర వాటిని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపించామని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చిరుత మృతి గల కారణాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు. అనంతరం సింగారం సమీపంలోని ఫారెస్ట్ కార్యాలయం దగ్గర చిరుత మృతదేహాన్ని దహనం చేశారు.



బండరాళ్ల మధ్య చిరుత మృతదేహం